# పొదుపు

కిశోరి

"కాంతం! నే చెప్పే మాట వింటావా?" ప్రశాంతంగా అన్నాడు సుబ్బారావు. భార్య లక్ష్మీకాంతంతో.

నేను వినన గాక వినను." విసురుగా అంది పెద్దగొంతుతో కాంతం.

"అది కాదే కాంతం!" భార్యకు నచ్చచెప్ప బోయాడు.

"ఏది కాదండీ?" మాటను సాగదీస్తూ వెక్కిరింతగా అంది.

"పెళ్ళై మూడేళ్ళైనా ఏనాడన్నా ముచ్చటగా మూడొందలు పెట్టి చీరె కొనిచ్చారా నాకు? ముష్టి నలభై, ఏభై రూపాయల చీరెలు తప్ప"

"కొనివ్వలేదు ఒప్పుకుంటున్నా ...కానీ...




కాంతం... అంత విలువగల సామాన్లు ప్రతి బోనస్ అందుకున్నపుడంతా కొంటున్నా గదటే?" శాంతంగానే అన్నాడు సుబ్బారావు.

"నేనూ సామాన్ల గురించి కాదండీచెప్పేది. చీరె గురించండీ. చీరె గురించి" అంది పెద్దగా.

"ఆహా... నాకు బాగా వినపడుతుంది గాని కాస్త గొంతు తగ్గించి మాట్లాడవే నీకు పుణ్యం వుంటుంది. ఎవరైనా వింటే ఏమను కుంటారూ?" అతను జనానికి జడిసే మనిషి.

"ఎవరే మనుకుంటే మనకేమిటండీ! మనింట్లో మన యిష్టమొచ్చినట్లు మాట్లాడు కుంటాం. సరే గానీ... ఇంతకూ చీరె..." అంటూ మళ్ళీ చీరె గురించి ఎత్తబోయింది.

"కాంతం! చూడు ఇంతవరకు ఇంటికి అవసరమైన సామాన్లు ప్రతి బోనస్‌కు కొంటూనే వున్నాకదా! ఇక నుంచైనా కాస్త ఆ డబ్బు సేవింగ్ చేసుకుంటే ఎప్పుడైనా అవసరానికి పనికొస్తుందే. ఎవడినీ అప్పడగకుండా."

"ఈసారి బోనస్ వచ్చినపుడలాగే చేద్దురు గాని ఇప్పటికి మాత్రం ఆరు నూరైనా, నూరు ఆరైనా పెద్ద చీరొకటి కొనాల్సిందే" అంటూ ఖచ్చితంగా చెప్పేసింది కాంతం.

"అంతేనంటావా...?" నీరసంగా అన్నాడు సుబ్బారావు.

"అంతే..."

"సరే నీ యిష్టం వచ్చినట్లు చేసుకో. పెద్దలు వూరికే అన్నారా ? మొండికేసినదాన్ని మొగుడేమి చేయునని ? రచ్చకెక్కిన దాన్ని రాజేమి చేయునని?" అని చిన్నగా తనలో తనే గొణుక్కుంటున్నట్లుగా కుర్చీనుండి లేచాడు సుబ్బారావు.

ఆ మాటలు అతనెంత చిన్నగా గొణిగినా కాంతం చెవిన పడనే పడ్డాయి.


"అంటే ... అంటే ... ఏమిటండీ మీ వుద్దేశం ? నేను మీ కంటికి అంత మొండిదానిగా కనిపిస్తున్నానా?" గయ్యిమని లేచేంది.

"ఒసే...ఒసే...కాంతం! ఇదిగో బుద్ధి తక్కువై ఆ మాటన్నాను" అంటూ లెంపలు వేసుకున్నాడు సుబ్బారావు ఆమె నోటికి జడుస్తూ.

భర్త అలా చెంపలు వేసుకుంటుంటే మనసులో గర్వంగా నవ్వుకుంటూ వంటింట్లో కడుగుపెట్టింది కాంతం.

"నా ఖర్మ! నేరకపోయి నిన్ను కట్టుకున్నానే ముద్దుగా, బొద్దుగా వున్నావని. మీ అమ్మా, నాన్న నీకు పొరపాటున లక్ష్మీకాంతం అని పెట్టారు సూర్యకాంతం అని పెట్టకుండా." అని మనసులోనే గొణుక్కున్నాడు సుబ్బారావు. బైటికి గొణుక్కుంటే ఆమెకు వినపడుతుందని భయపడి.

అసలు విషయం ఏమిటంటే ఆ రోజు సుబ్బారావుకు బోనస్ వచ్చింది. ప్రతిసారి బోనస్ వచ్చినపుడంతా ఇంటికి అవసరమైన సామాగ్రి తెచ్చేవాడు. ఈసారి నుండి ప్రతి బోనస్ సేవింగ్స్ బ్యాంకులో వేద్దామనుకొని ఆ మాట భార్య చెవిని గూడా వేయాలని వేశాడు. తీరా అది ఇలా అయింది పెళ్ళై ఏడాది తిరక్కముందే అబ్బాయి పుట్టాడు. ఇప్పుడు మళ్ళీ నెల తప్పింది కాంతం. ఇంట్లో ఖర్చులు మాత్రం రోజు రోజుకూ పెరుగుతున్నాయిగాని జీతం మాత్రం పెరగదు కదా! అతనికి ఏ దురలవాట్లూ లేవు గనుక, ఆ సంసారాన్ని పొదుపుగా నెట్టుకొస్తున్నాడు. అప్పు చేయడమంటే అతనికి మహా చెడ్డ చిరాకు. వున్నదాంట్లోనే సర్దుకుపోవాలన్నది అతని తత్వం. ఇంట్లో నాలుగో మెంబరు రాబోతున్నాడని తెలిసి, ముందు జాగ్రత్తగా వచ్చే బోనస్నైనా ఆదా చేద్దామని అనుకుంటున్నాడతను. భార్యకీ విషయం ఎంత నచ్చచెప్పాలని చూసినా ఫలితం లేకపోయింది. ఆవిడొక మొండి మనిషి. సుబ్బారావు ఆమెకు భయపడడుగాని ఆమె నోటికి మాత్రం జడుస్తాడు. అంతటి మెతక మనిషతను. అందుకే మరి నోరెత్తకుండా బోనస్ డబ్బు మొత్తం తెచ్చి భార్య చేతిలో గుమ్మరించాడు. "నీ యిష్టమొచ్చింది కొనుక్కోమని.' 'దాంతో కాంతం ముఖం చేటంతైంది. సుబ్బారావు డబ్బు ఇవ్వడమేమిటి ? ఆమె చీరె కొనక పోవడమేమిటి? ఆ రోజు సాయంత్రమే త్వరగా వంట పని ముగించుకుని పక్కింటావిడలో కలిసి బజారు కెళ్ళింది చంటాడిని సుబ్బారావు కప్పగించి. సుబ్బారావు ఇచ్చిన డబ్బుకన్నా మరో ఇరవై ఎక్కువపెట్టి మాంచి చీరె కొనుక్కొచ్చింది. ఆ ఇరవై పక్కింటామెవద్ద చేబదులు తీసుకుని. ఇంటికి వచ్చీ రావడంతోనే క్రొత్త చీరె చూపించింది కాంతం, సుబ్బారావుకు.



"ఏమండీ! చీరె బాగుందా?" ముద్దుగా అడిగింది.

"వూ..." అంటూ నీరసంగా మూలిగాడు సుబ్బారావు.

"అంత డబ్బు పోసికొన్నాక చీరె బాగుండదా?" అని మనసులో అనుకుంటూ.

"మాట్లాడరేమండీ ? మీకు నచ్చలేదంటే నాపసిస్తానులెండి..."

"ఆహా ...హా...నచ్చకపోవడమేమిటి కాంతం ! చాలా బాగుంది. ఈ చీరెలో నీవు మరీ బాగుంటావు" అన్నాడు సుబ్బారావు ముఖాన లేని నవ్వు పులుముకొని. డబ్బు ఎలాగూ ఖర్చయి పోయింది ఆమెనైనా సంతోష పెట్టినట్లవుతుందనుకొని.

"మీరా మాట అంటారని నాకుతెలుసండీ? అందుకే పోతే పోయిందని మరో ఇరవై రూపాయలు పక్కింటావిడ వద్ద బదులు తీసుకునికొన్నాను" అంది గోముగా భర్తతో.

"ఆ..." అంటూ నోరు వెళ్ళబెట్టేశాడు సుబ్బారావు.

★ ★ ★

"ఏమండీ ! వుదయం మీరాఫీసుకు వెళ్ళినప్పటి నుండి బాబుకు ఒకటే జ్వరం. అక్కడికీ ఇంట్లో ఉండే ట్యాబ్లెట్ వేశాను. తగ్గలేదు. ఒకటే మూలుగుతున్నాడు. నాకేమిటో భయంగా వుందండీ !" అంది కాంతం. మధ్యాహ్నం టిఫిన్కని ఇంటికి వచ్చిన సుబ్బారావుతో.

"అరె ! అంత జ్వరంవస్తే డాక్టరు వద్దకు వెళ్ళకుండా వున్నావా?" అంటూ ఆత్రంగా బట్టలు మార్చుకోబోతున్నవాడల్లా మానేసి ఆత్రంగా బాబును పడుకోబెట్టిన మంచం వద్దకు వెళ్ళి ఒంటిపై చెయ్యివేశాడు. చెయ్యి చురుక్కుమంది. వెంటనే రిక్షా మాట్లాడి ఇద్దరూ కలిసి బాబును డాక్టరు వద్దకు తీసుకెళ్ళారు. ఆయన ఇంజక్షన్ చేసి మందులు వ్రాసిచ్చి అవి ఎలా వాడాలో చెప్పి పదిరూపాయలు ఫీజు పుచ్చుకున్నాడు. పదిరూపాయలు పోయినా ఫరవాలేదు జ్వరం తగ్గితే చాలనుకున్నారిద్దరూ. కాని వారం రోజులకుగాని జ్వరం తగ్గలేదు బాబుకు. ఆ వారానికే మందులు, ఇంజక్షన్లు, డాక్టరుఫీజు, రిక్షా ఛార్జీలు మొత్తం రెండువందలదాకా ఖర్చయింది. అప్పు చేయడమంటే చిరాకుపడే సుబ్బారావు పాపం అప్పు చేయక తప్పలేదు. బాబుకు జ్వరం పూర్తిగా తగ్గాక ఈ విషయమే భార్యతో అన్నాడు.

"చూడు కాంతం ! ఆ రోజు బోనస్ డబ్బు బ్యాంక్లో దాచుంటే ఈ రోజు సమయానికి అక్కరకు వచ్చేది. అప్పు చేయాల్సిన అవసరం వుండేదికాదు గదా!" అని.

అతనన్న మాటలకు రెండువారాల క్రిందట కొన్న చీరె జ్ఞాపక మొచ్చింది కాంతానికి. ఆ చీరె తెచ్చి పెట్టెలో దాచిందేకాని ఇప్పుడు అవసరానికి పనికి రాలేదు. అదే అతను చెప్పినట్లు బ్యాంక్లో దాచుకుని వుంటే అవసరానికి వుపయోగపడేది. "సమయానికి అప్పు దొరికింది. అది దొరక్కపోయివుంటే?" ఈ వూహ రాగానే ఆమె వళ్ళు జలదరించింది.

"నిజమేనండీ! మీరు చెప్పింది ఒప్పుకుంటున్నా. ఇక నుండి సంసారం పొదుపుగా చేసుకుని ఆ అప్పు తీర్చేసి అంతో ఇంతో బ్యాంక్లో దాచుకుందాం" అంది కాంతం వడిలో పడుకొని ప్రశాంతంగా నిద్రపోతున్న బాబును హృదయానికి హత్తుకుంటూ.

"అమ్మయ్య!" అంటూ తేలిగ్గా ఓ నిట్టూర్పు విడిచాడు సుబ్బారావు. ఇప్పటికైనా భార్యకు "పొదుపు" అంటే తెలిసొచ్చిందని! □